తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 12 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 351 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# పాక్ బుల్లెట్లకు ఫిరంగులతో సమాధానం

## పాకిస్తాన్‌కు భారత్ గట్టి హెచ్చరిక

- భారత్‌కు స్పష్టమైన కశ్మీర్ వైఖరి – చర్చలు అక్కర్లేదు: ప్రధాని మోదీ
- పాక్‌పై దాడికి ముందు అమెరికాకు సమాచారం: జైశంకర్ వ్యాఖ్యలు
- పాక్ సైనిక స్థావరాలపై భారత్ మెరుపు దాడులు – మే 9, 10 మధ్య ఘర్షణలు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ తలవంచింది – అమెరికా చొరవపై స్పందన
- డీజీఎంఓల చర్చతో కాల్పుల విరమణకు అంగీకారం
- భారత దాడులతో పాక్‌కు గట్టిన మానసిక దెబ్బ – స్థావరాలపై కచ్చితమైన దాడులు

**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**

పాకిస్థాన్ బుల్లెట్లకు ఫిరంగులతో సమాధానం ఇవ్వాలని భారత సైన్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. పాకిస్థాన్ ప్రతీ చర్యకు భారత్ నుంచి బలమైన ప్రతిస్పందన ఉండాలని సాయుధ దళాలకు సూచించారు. కశ్మీర్ విషయంలో భారత్‌కు చాలా స్పష్టమైన వైఖరి ఉందని మోదీ వెల్లడించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా కశ్మీర్ అంశంలో పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చి చెప్పాయి. అంతే కాకుండా పాకిస్థాన్ పై దాడి చేస్తామని ముందే అమెరికాకు భారత్ చెప్పినట్లు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులపై దాడి చేసి తీరుతామని, దానిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని మే 1న అమెరికా విదేశాంగ మార్కో రూబియోకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 'ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులతో పాకిస్తాన్‌కు ఉన్న లింకులపై సరికొత్త ఆధారాలతో ఒక టీమ్‌ను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి భారత్ పంపనుంది. వచ్చే వారం యూఎన్ఎస్‌సీఆర్ 1267 ఆంక్షల కమిటీ సమావేశమై ఈ ఆధారాలను పరిశీలించనుంది' అని భారత ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌పై మూడ్రోజుల సైనిక చర్య తర్వాత పరిస్థితులు సంపూర్ణంగా మారిపోయాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచం, పాకిస్థాన్ దీన్ని అంగీకరించాలని, పరిస్థితులు గతంలో మాదిరిగా ఉండవని తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమాప్తం కాలేదని, సైనిక చర్య తర్వాత పరిస్థితులన్నీ కొత్తస్థాయికి చేరుకున్నాయని వెల్లడించాయి. ప్రధాన సైనిక స్థావరాలపై విజయవంతంగా దాడులు చేసి పాక్ మనోబలాన్ని దెబ్బతీశామని పేర్కొన్నాయి. వైమానిక స్థావరాలపై దాడులతో పాక్‌కు వాస్తవ పరిస్థితి అవగతమైందని, భారత్‌తో పోటీపడే పరిస్థితులు లేవన్న విషయం పాక్‌కు తెలిసొచ్చిందని వివరించాయి. ఉగ్ర స్థావరాలపై దాడి చేసి ISIకు భారత్ స్పష్టమైన సందేశం ఇచ్చిందని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. భారత నిఘా నేత్రాల నుంచి పాకిస్థాన్ తప్పించుకోలేదని స్పష్టంచేసినట్టు పేర్కొన్నాయి. ఉగ్రవాద ప్రధాన స్థావరాలపై భారత్ కచ్చితమైన దాడులు చేసి చూపించిందని, చొరబాటుదారులు, బాధితుల మధ్య ఒకే వేదికపై చర్చలు సాధ్యం కాదని భారత్ ప్రపంచానికి చెప్పిందని వివరించాయి.

> భారత సైనిక వర్గాల కథనం ప్రకారం మే 9న రాత్రి, మే 10న తెల్లవారుజామున పాకిస్థాన్‌లోని సైనిక స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసింది. అనంతరం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రంగంలోకి దిగి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు కాల్ చేసి మాట్లాడారు. అనంతరం భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు రూబియో ఫోన్ చేశారు. భారత్‌తో చర్చలకు పాకిస్తాన్ సిద్ధంగా ఉందని జైశంకర్‌కు రూబియో సమాచారం ఇచ్చారు. కేవలం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల స్థాయిలో చర్చలు జరుగుతాయని భారత్ స్పష్టం చేసింది. తదుపరిగా మే 10న మధ్యాహ్నం 1 గంటలకు ఫోన్ కాల్ చేయడానికి భారత డీజీఎంఓను పాకిస్థాన్ డీజీఎంఓ అపాయింట్‌మెంట్ కోరారు. తదుపరిగా ఇరుదేశాల డీజీఎంఓలు చర్చించుకొని కాల్పుల విరమణపై అంగీకారానికి వచ్చారు. వాస్తవానికి మే 7నే 'ఆపరేషన్ సిందూర్'ను పూర్తి చేశాక, పాక్ డీజీఎంఓకు భారత డీజీఎంఓ ఒక మెసేజ్‌ను పంపారు. అయితే ఆ రోజున పాక్ డీజీఎంఓ నుంచి స్పందన రాకపోవడం గమనార్హం.



# మోదీకి రాహుల్ లేఖ

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశం కావాలని విజ్ఞప్తి
- అఖిలపక్ష సమావేశాల్లో కాంగ్రెస్ మద్దతు – కానీ ప్రధాని గైర్హాజరు
- మల్లికార్జున్ ఖర్గే స్పందన – రాహుల్ లేఖకు సంపూర్ణ మద్దతు
- భారత ప్రభుత్వం చర్యలు – సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులకు గడువు
- పాక్ దాడులకు తక్షణ స్పందన – డ్రోన్లు, క్షిపణులకు భారత్ సమాధానం
- ఘర్షణల నేపథ్యంలో పార్లమెంట్ చర్చ అవసరం – కాంగ్రెస్ అభిప్రాయం

**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్న వేళ.. ఈ ఇరు దేశాలు తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్‌తోపాటు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చ జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ లేఖ రాశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా తీర్మానించాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్‌తోపాటు కాల్పుల విరమణ ఒప్పందంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో..


# రావల్పిండిపై దాడులు..

## ఉగ్రవాదానికి భారత్ గట్టి హెచ్చరిక: రక్షణ మంత్రి రాజ్‌నాథ్

- పీఓకే, పాక్ సైనిక స్థావరాలే లక్ష్యం.. పౌరులకు ఎలాంటి హాని లేదన్న రాజ్‌నాథ్
- ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత దృఢ సంకల్పానికి జీవం
- పహల్గాం ఉగ్రదాడికి గట్టి ప్రతీకారం.. భారత్ సర్జికల్ బలానికి మరో సాక్ష్యం
- రావల్పిండిలోని సైనిక ప్రధాన కార్యాలయంపై భారత్ దాడి
- పాక్ దుశ్చర్యలకు వ్యూహాత్మక సమాధానం ఇచ్చిన భారత బలగాలు
- సరిహద్దులకు ఆవల ఉగ్ర స్థావరాలకు ఇక చోటులేదన్న సంకేతం
- నవభారతం వెనకడుగు వేయదన్న స్పష్టం.. మోదీ నేతృత్వంపై రాజ్‌నాథ్ విశ్వాసం
- లక్నోలో బ్రహ్మోస్ టెస్టింగ్ కేంద్రం ప్రారంభం.. సమర్థవంతమైన డిఫెన్స్ ప్లానింగ్


2 లో..






# 100 మంది ఉగ్రవాదులు, 40 మంది పాక్ ఆర్మీ సిబ్బంది హతం: డీజీఎంవో

- ఉగ్రవాదులపై కచ్చితమైన దాడులు .. 9 ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా తీసుకున్న ఆపరేషన్ సిందూర్
- పెహల్గాం దాడికి బలమైన ప్రతీకారం.. 100 పైగా ఉగ్రవాదులు హతం
- వీరమరణం పొందిన ఐదుగురు జవాన్లు.. దేశం తరఫున శ్రద్ధాంజలి
- ఐసీ814, పుల్వామా దాడుల మాస్టర్‌మైండ్లు హతం.. కీలక టార్గెట్లపై భారత్ విజయవంతం
- పాక్ డ్రోన్ల దాడులకు సమర్థవంతమైన ప్రతిచర్య.. పౌర విమానాలను కవర్‌గా పాక్ వ్యూహం విఫలం
- అరేబియా సముద్రంలో నేవీ అప్రమత్తత కరాచీపై దాడికి కూడా సిద్ధం
- పాక్ నేవీ ప్యానిక్‌లోకి – పోర్టులకు పరిమితమైన సముద్ర సేన




**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**

ఆపరేషన్ సిందూర్‌తో తాము 9 ఉగ్రస్థావరాలను టార్గెట్ చేశామని భారత రక్షణ దళాలు మరోసారి స్పష్టంచేశాయి. పలు ఉగ్రస్థావరాలను టెర్రరిస్టులు ఖాళీ చేసి వెళ్లిపోయిన విషయం తెలిసిందని, ఈ క్రమంలో ఈ 9 స్థావరాలను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకొని దాడులు చేశామని భారత దళాలు తెలిపాయి. పెహల్గాంలో జరిగిన హింసాత్మక, క్రూరమైన ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశామని, ఈ దాడిలో వందమందికి పైగా ఉగ్రవాదులు మరణించారని డీజీఎంవో లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. ఆపరేషన్ అనంతరం తాము కేవలం ఉగ్ర స్థావరాలనే టార్గెట్ చేశామనే విషయాన్ని పాకిస్తాన్ డీజీఎంవోకు వివరించామన్నారు. కానీ పాక్ మాత్రం తమ వివరణను వినిపించుకోలేదని, భారత్‌పై దాడి చేస్తామని ప్రకటించిందని ఆయన చెప్పారు. అలాగే ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతున్నదని, పాక్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే దీటుగా బదులిచ్చేందుకు అందరు కమాండర్లకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని డీజీఎంవో ఘాయ్ వివరించారు.

మిగతా 2లో..

# కశ్మీర్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**



భారత్‌పాక్ మధ్య యుద్ధం వాతావరణం ముదురుతున్న సమయంలో అమెరికా జోక్యంతో సర్దుమణిగింది. కాల్పుల విరమణకు రెండు దేశాలూ అంగీకరించాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియాపాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తమ దేశం మధ్యవర్తిత్వం వహించదన్నారు. అయితే ఈ సందర్భంగా ఆయన కశ్మీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు..

భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడారు. భారత్, పాక్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందన్నారు. కాల్పులు విరమించకపోతే లక్షలాది మంది చనిపోయేవారని చెప్పారు. భారత్, పాక్ బలమైన నాయకత్వాల పట్ల తాను గర్వపడుతున్నట్లు తెలిపారు. కశ్మీర్ సమస్యకు వెయ్యేళ్ల తర్వాత అయినా పరిష్కారం లభిస్తుందేమో, లేదే చూడాలన్నారు. అయితే కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో రెండు దేశాలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే రెండు దేశాలతో వ్యాపారాన్ని గణనీయంగా పెంచుకుంటామని తెలిపారు. చాలా మంది మరణానికి, విధ్వంసానికి దారితీసే ఈ యుద్ధాన్ని ఆపడం తెలివైన నిర్ణయమని చెబుతూ.. రెండు దేశాల నాయకులకూ ట్రంప్ తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# కశ్మీర్‌పై భారత్ స్పష్టమైన సంకేతం: మధ్యవర్తిత్వం అవసరం లేదు




**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**

'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని ఇప్పటికే స్పష్టం చేసిన భారత్ 'కశ్మీర్' విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని తేల్చి చెప్పింది. 'కశ్మీర్' అంశంలో ఇండియా, పాక్ మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తానని ప్రకటించిన కొన్ని గంటల్లోనే భారత్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆఫర్‌ను పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ స్వాగతించినప్పటికీ ఇండియా మాత్రం ఎవరి మధ్యవర్తిత్వం తమకు అవసరం లేదని ఇండియా కరాఖండిగా చెప్పేసింది. 'కశ్మీర్' అంశంపై కొత్తగా మాట్లాడుకోవడానికి ఏం లేదని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు తిరిగివ్వడం ఒక్కటే మిగిలి ఉందని భారత్ స్పష్టం చేసింది. పాకిస్తాన్ ఇంతకు మించి ఏదైనా మాట్లాడదలచుకుంటే ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాకే చర్చలకు అవకాశం ఉంటుందని పాకిస్తాన్‌కు భారత్ తేల్చి చెప్పింది.

# అందాల పోటీలు ఆరంభం..

## ర్యాంప్ వాక్‌తో మెరిసిన అందాల భామలు



ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 31 వరకు తెలంగాణ వేదికగా జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 110 దేశాల అందగత్తెలు, నాలుగు ఖండాలుగా ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రత్యేక ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఔరా అనిపించాయి.

3 లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక




# రావల్పిండిపై దాడులు.. ఉగ్రవాదానికి భారత్ గట్టి హెచ్చరిక: రక్షణ మంత్రి

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

భారత సాయుధ బలగాలు కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్ర స్థావరాలపైనే కాకుండా, పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోని కీలక సైనిక స్థావరాలపై కూడా దాడులు చేసి తమ పోరాట పటిమను చూపాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన ప్రకటన చేశారు. లక్నోలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. "ఉగ్రవాదంపై భారత ప్రభుత్వ దృఢ సంకల్పానికి, మన సాయుధ బలగాల అపార శక్తిసామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' నిలువెత్తు నిదర్శనం. ఉరి దాడుల అనంతరం సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా ఉగ్రదాడి తర్వాత వైమానిక దాడుల మాదిరిగానే, పహల్గామ్ ఘటన అనంతరం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమని ప్రపంచానికి స్పష్టం చేశాం" అని రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని, సాధారణ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన వివరించారు. అయితే, పాకిస్థాన్ దీనికి భిన్నంగా వ్యవహరించిందని, మతపరమైన ప్రదేశాలతో సహా భారతీయ పౌర ప్రాంతాలపై దాడులకు తెగబడిందని ఆయన ఆరోపించారు. "ఇటువంటి దుశ్చర్యలకు ప్రతిగా మన సాయుధ బలగాలు అద్భుతమైన ధైర్యసాహసాలు, వ్యూహాత్మక సంయమనం ప్రదర్శించాయి. శత్రువులకు గట్టి గుణపాఠం చెబుతూ, పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండితో సహా పలు పాకిస్థానీ సైనిక స్థావరాలపై దాడులు చేసి దీటుగా స్పందించాయి" అని ఆయన గర్వంగా ప్రకటించారు. ఈ చర్యలతో సరిహద్దులకు ఆవల ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు లేవనే బలమైన, స్పష్టమైన సందేశాన్ని భారత్ పంపిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నవభారతం సరిహద్దులకు ఇరువైపులా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని, ఉగ్రవాదంపై పోరులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు




## 100 మంది ఉగ్రవాదులు, 40 మంది పాక్ ఆర్మీ సిబ్బంది హతం: డీజీఎంవో

(మొదటి పేజీ తరువాయి)

పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ అనంతరం కూడా ఎల్‌వోసీ వద్ద పాక్ దళాలు కాల్పులకు తెగబడ్డాయని డీజీఎంవో ఘాయ్ తెలిపారు. వీటికి భారత దళాలు కూడా గట్టిగా బదులిచ్చాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పటి నుంచి ఎల్‌వోసీ వద్ద ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ ఎదురు కాల్పుల్లో ఐదుగురు భారత జవాన్లు వీరమరణం పొందారని, వారి త్యాగాలను ఈ దేశం ఎన్నటికీ మర్చిపోదని తెలిపారు. అలాగే ఎల్‌వోసీ వద్ద కాల్పుల్లో 40 మంది పాకిస్తాన్ సైనికులు, అధికారులు హతమయ్యారని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్‌తో తాము టార్గెట్ చేసిన ఉగ్రస్థావరాల వివరాలను ఎయిర్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు. ముఖ్యంగా మురిద్కే, బహవల్‌పూర్‌లో తాము చాలా కచ్చితత్వంతో ఉగ్రస్థావరాలపై దాడి చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఐసీ814 హైజాక్ మాస్టర్‌మైండ్ యూసుఫ్ అజహర్, పుల్వామా ఉగ్రదాడి ప్లాన్ చేసిన అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ కూడా హతమయ్యారని ఆయన చెప్పారు. ఈ దాడుల తర్వాత భారత వాయుసేన స్థావరాలు, సామాన్య ప్రజానీకంపై పాకిస్తాన్ డ్రోన్లు, మానవ రహిత ఎయిర్ వెహికల్స్‌తో దాడులకు తెగబడిందని ఆయన తెలిపారు. సివిలియన్ విమానాలను అడ్డుపెట్టుకొని చేసిన ఈ దాడులను తాము సమర్థవంతంగా తిప్పికొట్టామని భారతి చెప్పారు. ఆ విమానాలను తప్పించుకుంటూ శత్రులక్ష్యాలను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడులకు ప్రతిగా తాము కూడా ఎదురు దాడులు చేశామని, పాకిస్తాన్‌లోని రాడార్ సైట్లు, ఎయిర్‌బేస్‌లను టార్గెట్ చేసుకొని దాడి చేశామని పేర్కొన్నారు. తాము టార్గెట్ చేసిన ఎయిర్‌బేస్‌ల ఫొటోలను కూడా విడుదల చేశారు.

ఈ దాడుల తర్వాత శనివారం మధ్యాహ్నం 3.55 గంటల ప్రాంతంలో పాక్ డీజీఎంవో తనను కాంటాక్ట్ చేశారని భారత డీజీఎంవో ఘాయ్ చెప్పారు. 'ఉగ్రస్థావరాలను టార్గెట్ చెయ్యడమే 'ఆపరేషన్ సిందూర్' లక్ష్యం. అది పూర్తయిన తర్వాత కేవలం శత్రుదాడులనే మేం తిప్పికొడుతున్నాం. కాబట్టి నేను పాక్ డీజీఎంవోతో మాట్లాడాను. ఆయనే కాల్పుల విరమణను ప్రతిపాదించారు' అని ఘాయ్ స్పష్టంచేశారు. అలాగే, ఆ ఆపరేషన్‌లో వీరమరణం పొందిన ఆటాజవాన్ల త్యాగాన్ని భారత్ ఎప్పటికీ మర్చిపోదన్నారు.

**అరేబియా సముద్రంలో నేవీ..**

**ఈ ఆపరేషన్ సమయంలో భారత నేవీ కూడా అరేబియా సముద్రంలో చాలా అప్రమత్తంగా ఉందని నేవీ వైస్ అడ్మైరల్ ఏఎన్ ప్రమోద్ తెలిపారు. పాకిస్తాన్‌లో ఎలాంటి లక్ష్యాలనైనా టార్గెట్ చేసేందుకు సిద్ధంగా నేవీ నిలబడిందన్నారు. అవసరమైతే కరాచీపై దాడి చేసేందుకు కూడా సిద్ధంగా నిలబడి, పాక్ నేవీని పూర్తిగా ఆత్మరక్షణలో పడేలా చేసిందని తెలిపారు. పాక్ నేవీ దళాలు వారి పోర్టుల్లోనే ఉండిపోవాల్సి వచ్చిందని, వారు భారత్ వైపు వచ్చే సాహసం కూడా చెయ్యలేకపోయిందని స్పష్టం చేశారు.**



# మోదీకి రాహుల్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి మనమంతా ఇలా సమావేశమై నిర్ణయం తీసుకోనే అవకాశం లభిస్తోందని ఆయన చెప్పారు. తన ఈ డిమాండ్‌పై వెంటనే స్పందించి.. నిర్ణయం తీసుకుంటారని రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు.

మరోవైపు పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరిచి.. పహల్గాంలో ఉగ్రదాడిపై చర్చించాలని ప్రధాని మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే లేఖ రాశారు. ఏప్రిల్ 28వ తేదీన ప్రధాని మోదీకి ఖర్గే ఈ లేఖ రాసిన విషయం విదితమే. అయితే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ రాసిన లేఖపై మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ఈ అంశంపై గతంలోనే ప్రధానికి లేఖ రాశానని చెప్పారు. ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ రాసిన లేఖకు తాను మద్దతు తెలుపుతున్నానని ఈ సందర్భంగా ఖర్గే స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ రాసిన లేఖ పట్ల ప్రధాని మోదీ సానుకూలంగా స్పందిస్తారని ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట సైనిక చర్యల చేపట్టిన తర్వాత కేంద్రం రెండు సార్లు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశాలకు ప్రధాని మోదీ హాజరు కాలేదు. అయితే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రభుత్వం చేపట్టే ఎటువంటి చర్యకైనా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ అఖిల పక్ష సమావేశాల్లో ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిన విషయం విషయం విధితమే.

ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ ఘటన వెనుకు కర్మ, కర్త, క్రియ అంతా పాకిస్థాన్ ఉందనే బలమైన సాక్ష్యాలను భారత్ సంపాదించింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దాంతో సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. అలాగే భారత్‌లోని పాకిస్థానీలంతా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. అందుకు గడువు సైతం విధించింది. ఆ తేదీ కూడా ముగిసింది. ఇక పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చర్యలు తీసుకుంది. అందుకు ప్రతిగా భారత్ సరిహద్దులోని పలు రాష్ట్రాల్లోకి పాక్ సైన్యం డ్రోనులు, క్షిపణులతో దాడికి దిగింది. వెంటనే స్పందించిన భారత్.. వీటిని తిప్పికొట్టింది. ఇక కాల్పుల విరమణ ఒప్పందాన్ని సైతం పాకిస్థాన్ ఉల్లఘించింది. దీనికి సైతం భారత్ తనదైన శైలిలో సమాధానమిచ్చింది. ఇలాంటి పరిస్థితులు ఇరు దేశాల మధ్య నెలకొన్న నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభలను సమావేశం ఏర్పాటు చేసి.. దీని వేదికగా పరిస్థితులపై చర్చించాలని విపక్ష కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. అందులోభాగంగా ప్రధాని మోదీకి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారు.



# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి 100 విమానాలు రద్దు

- భారత్-పాక్ ఉద్రిక్తత... విమాన సర్వీసులపై ప్రభావం
- ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పలు చర్యలు
- విమానాల రద్దుతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. దీని ప్రభావంతో, ఆదివారం ఒక్కరోజే దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించాల్సిన సుమారు 100 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ పరిణామం ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది.

భారత్‌పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగిన దృష్ట్యా, ముందు జాగ్రత్త చర్యగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసిన విషయం విదితమే. ఈ క్రమంలో, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల మధ్యకాలంలో రద్దయిన విమానాల్లో 96 దేశీయ సర్వీసులు ఉండగా, ఒక అంతర్జాతీయ సర్వీసు కూడా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఈ పరిణామాలపై ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ స్పందిస్తూ, ఢిల్లీ విమానాశ్రయం సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తోందని పేర్కొంది. అయితే, గగనతల డైనమిక్స్‌లో చోటుచేసుకున్న మార్పులు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల కారణంగా కొన్ని విమానాల ప్రణాళికలు (షెడ్యూళ్లు) మరియు భద్రతా తనిఖీ కేంద్రాల ప్రాసెసింగ్ నియమాల్లో మార్పులు సంభవించే అవకాశం ఉందని వివరించింది.

ఈ భద్రతా చర్యలు 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా కొనసాగుతున్నాయని, ప్రయాణికుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని, ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు.

# వీరజవాన్ మురళీనాయక్‌కు దేశం సెల్యూట్

## కల్లితండాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు





(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్‌కు యావత్ దేశం సెల్యూట్ చేస్తోంది. అగ్నివీరుడిగా సైన్యంలోకి ఎంటరై, అమరవీరుడిగా అందరికీ స్ఫూర్తిని అందిస్తోన్న యువ కెరటానికి ఈ దేశం సలామ్ చేస్తోంది. పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు ముగిశాయి. అధికార లాంఛనాలతో మురళీ నాయక్ అంత్యక్రియలు పూర్తి చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్‌కు యావత్ దేశం సెల్యూట్ చేస్తోంది. అగ్నివీరుడిగా సైన్యంలోకి ఎంటరై, అమరవీరుడిగా అందరికీ స్ఫూర్తిని అందిస్తోన్న యువ కెరటానికి ఈ దేశం సలామ్ చేస్తోంది. పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు ముగిశాయి. అధికార లాంఛనాలతో మురళీ నాయక్ అంత్యక్రియలు పూర్తి చేశారు. మురళీ అంతిమయాత్రలో భారీగా పాల్గొన్నారు ప్రజలు. మురళీనాయక్ వ్యవసాయ క్షేత్రం వరకు దారి పొడవునా.. పూలు చల్లుతూ నివాళులు అర్పించారు. మురళి పార్థీవదేహం దగ్గర కడసారి తల్లిదండ్రులు చేసిన సెల్యూట్ అందరికీ కన్నీళ్లు తెప్పించింది. మురళీ నాయక్ అమర్ రహే అంటూ అంత్యక్రియల ప్రాంగణం హోరెత్తింది. మురళీనాయక్ స్వగ్రామం కల్లితండాలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అనిత, సవిత, అనగాని సత్య ప్రసాద్ కల్లి తండాకు వెళ్లారు. మురళీనాయక్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించి.. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో మురళీనాయక్ పాడె మోశారు మంత్రి లోకేష్. జాతీయ జెండా చేత పట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. మురళీనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఐదెకరాల పొలం, 300 గజాల ఇంటిస్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. మురళీనాయక్ తండ్రికి ఉద్యోగం ఇస్తామన్నారు పవన్, లోకేష్.. మురళీనాయక్‌కు అంతిమ వీడ్కోలు అంటూ.. సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. మురళి మన మధ్య లేకపోయినా.. అమరవీరుడి త్యాగం ఎప్పటికీ దేశ ప్రజల్లో స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుందన్నారు. మురళి కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు ఏపీ సీఎం చంద్రబాబు..

# జగిత్యాలకి 3 ట్రామా కేర్ సెంటర్లు: దామోదర రాజనర్సింహ



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)


రోగులకు వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వద్దని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉత్తర తెలంగాణకు జగిత్యాల జిల్లా కీలకమని, జిల్లాను వైద్యపరంగా బలోపేతం చేసి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం వైద్యశాఖాధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఆస్పత్రులకు అవసరమైన వైద్య పరికరాలు సమకూరుస్తామని, జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో మూడు డయాలసిస్ సెంటర్లు ఉన్నాయని, వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వందశాతం ప్రసవాలు చేయాలన్నారు. సిజేరియన్‌లు చేయడంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని, సాధారణ ప్రసవాలు పెంచాలని ఆదేశించారు. జిల్లాలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ జిల్లాకేంద్ర ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌కు మరమ్మతు చేయాలని, నూకపల్లి వద్ద రెండు ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలని కోరారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు మూడు బస్సులు మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్.లత, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఖాద్రి, ఆస్పత్రి సూపరిటెండెంట్ సుమన్‌రావు పాల్గొన్నారు.

# రేపే పాలిసెట్

**276 పరీక్ష కేంద్రాల ఏర్పాటు**

**హాజరుకానున్న 1.06 లక్షల మంది**

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



పాలిటెక్నిక్(డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ పాలిసెట్25 ప్రవేశ పరీక్ష ఈ నెల 13న జరుగనున్నది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తారు. 276 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా, మొత్తం 1,06,716 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గంట ముం దే పరీక్షకు అనుమతించనుండగా, నిమిషం ఆలస్యమైనా వెనక్కి పంపించనున్నారు. సెంటర్ సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎస్‌బీటెట్ టీజీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





# అందాల పోటీలు ఆరంభం..

## ర్యాంప్ వాక్‌తో మెరిసిన అందాల భామలు

### మిస్ వరల్డ్ పోటీలకు గచ్చిబౌలిలో ఘన ఆరంభం.. తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక ప్రాధాన్యం

### భారత సైనికులకు సన్నద్ధంగా సెల్యూట్ .. మిస్ ఇండియా ఎంట్రీతో స్టేడియం మార్మోగింది

### ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన.. సంప్రదాయ దుస్తులతో ర్యాంప్ వాక్

**(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)**


హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లీ, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' తో కార్యక్రమం మొదలైంది. అనంతరం తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దాదాపు 250 మంది చిన్నారులు చేసిన పేరిణి నృత్యం, గుస్సాడీ , కొమ్ము కోయ నృత్య ప్రదర్శనలు, ఒగ్గుడోలు కళారూపాలు అలరించాయి. ఇండియా, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో బార్డర్‌లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు వేడుకల్లో సెల్యూట్ చేశారు. మొదటి రోజు పోటీల్లో భాగంగా కంటెస్టెంట్లు సంప్రదాయ దుస్తుల్లో తమ దేశ జెండాను పట్టుకుని ఎంట్రీ ఇచ్చారు.


ఈ సందర్భంగా మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా జాతీయ జెండాతో ర్యాంప్ పైకి రాగానే స్టేడియం మార్మోగిపోయింది. భారత్ మాతాకీ జై నినాదాలతో దద్దరిల్లింది. కాగా, ఇండియా, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు కావడం లేదని నిర్వాహకులు మొదట ప్రకటించారు. కానీ సాయంత్రం 5 గంటలకు ఇండియా, పాక్ మధ్య కాల్పుల విరమణ ప్రకటన వెలువడడంతో చివరి నిమిషంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈవెంట్‌కు హాజరయ్యారు. మరోవైపు బాలీవుడ్, టాలీవుడ్ నటులు, ప్రముఖ రాజకీయ నాయకులు హాజరవుతారని భావించినా.. బార్డర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా రాలేదని తెలిసింది. కార్యక్రమంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మిస్ వరల్డ్ అంటే ఒక్క అందానికే కాదని.. ప్రతిభ, ఆత్మవిశ్వానికి ప్రతీక అని మిస్ వరల్డ్-2024 క్రిస్టినా పిస్కోవా అన్నారు. ప్రపంచ శాంతి, ఐక్యతకు మిస్ వరల్డ్ పోటీలు ఎంతో తోడ్పడుతాయని నిర్వాహకులు తెలిపారు. టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ఈ వేడుకల ద్వారా ప్రపంచ శాంతికి చక్కటి మెసేజ్ ఇచ్చామన్నారు. తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని కంటెస్టెంట్స్‌ను ఆయన కోరారు.



ఇండియా, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలీసులు గచ్చిబౌలి పరిసర ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుని అణువణువూ తనిఖీ చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో పాస్‌లు మంజూరు చేశారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కాగా, ఈ ఈవెంట్‌ను దేశవిదేశాల్లో కోట్లాది మంది వీక్షించారు. దాదాపు వెయ్యి మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు నేరుగా, ఆన్‌లైన్ ద్వారా ఈవెంట్‌ను కవర్ చేశారు.

పోటీల్లో భాగంగా మొదటి రోజు అందాల భామల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్లు.. తమ దేశ సంప్రదాయ దుస్తులను ధరించి ర్యాంప్ వాక్ చేశారు. మొదటి రౌండ్‌లో కరేబియన్, లాటిన్ అమెరికా, రెండో రౌండ్‌లో ఆఫ్రికా ఖండం, మూడో రౌండ్‌లో యూరప్ ఖండం కంటెస్టెంట్లు, నాలుగో రౌండ్‌లో ఆసియా ఓషియానియా కంటెస్టెంట్లు ర్యాంప్ పైకి వచ్చారు. అందరికంటే చివరగా ర్యాంప్ పైకి వచ్చిన మిస్ వియత్నాం తనదైన డాన్స్‌తో ఆకట్టుకుంది. మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా వచ్చినప్పుడు స్టేడియం మార్మోగింది. చీర కట్టుతో ర్యాంపు పైకి వచ్చిన మిస్ నేపాలీ అందరి దృష్టిని ఆకర్షించింది





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రొఫెసర్ కోదండరామ్ ని కలిసిన ఎంపిజే బృందం



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఆదివారం ఖమ్మం నగరం లోని, ఖానాపురం లో జన సమితి కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఎంఎల్సీ కోదండరామ్ ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం నేతృత్వంలో ఎంపిజే బృందం వారిని కలసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసీమ్, తాము చేపడుతున్న సామాజిక, విద్యా మరియు మైనారిటీ హక్కుల పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రొఫెసర్ గారికి వివరించారు. ఎంపీజే పరిచయ పుస్తకాన్ని కూడా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంలో ప్రొఫెసర్ కోదండరామ్ ఎంపీజే బృందాన్ని అభినందించి, ముస్లిం మైనారిటీల భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ యత్నాలను అభినందించారు. సమాజంలో సామరస్యాన్ని చాటే విధంగా ఎంపీజే కార్యకలాపాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా నాయకులు గౌస్, హుస్సేన్ మియా తదితరులు పాల్గొన్నారు.



# డ్రైనేజీ నిర్వాహణలేక ప్రజల అవస్థలు

- కార్పొరేటర్, అధికారులు పట్టించుకొని వైనం
- ఎమ్మెల్యే దృష్టి సాధించాలని డిబిఎఫ్ హనమకొండ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ డిమాండ్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామం బతుకమ్మ కాలనీ 2 లో సిసి రోడ్డు వేసి సుమారు 5 సంవత్సరాలు కావస్తున్న మురికి కాలువలు వెయ్యని కారణం గా కాలనీలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంధని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు , స్టానిక కార్పొరేట్ కు పలు మార్లు వినతి పత్రం ద్వారా విన్నవించుకున్నా ఫలితం లేదు అని అన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతు ధలిత కాలనీలలో సీసీ రోడ్డు లు వేసి డ్రైనేజి కాలువలు తియ్యక పోవడం వల్ల కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,మోరీలు లేక ఇంటికో గుంత తీస్తే వాటి నుండి వచ్చే ధుర్వాసన,ధోమల వల్ల అనారోగ్యం పాలవుతున్నరని తేలిపారు. అలాగే ధళిత కాలనీ లకు చెత్త బండి వచ్చిన ధాకలాలు లేవని 65వ డివిజన్ కార్పొరేటర్ దివ్యరాణి రాజు నాయక్ డ్రైనేజీ సమస్యలు తక్షమే పరిష్కరించలని,అలగే వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు సమస్యల పై దృష్టి సారించాలని డిబిఎఫ్ హనమకొండ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ డిమాండ్ చేసారు..ఈ కార్యక్రమంలో నేస్తం యుత్ అధ్యక్షుడు సిహెచ్.రాజశేఖర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.







# అమరవీరులకు అశ్రు నివాళులు..

- ఆర్ . పి. వి. సంస్థ ఫౌండర్. సయ్యద్ సాదిక్ అలి దిగ్భాంతి..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళీ నాయక్ బాల్యం లోనే దేశభక్తిని సొంతం చేసుకుని, భారత సైన్యంలో చేరి దేశానికి సేవలందించారని, దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన మురళీ నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ ల త్యాగం ముస్లిం మైనార్టీ, గిరిజన సమాజానికి చిరస్మరణీయంగా నిలుస్తుందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలి అన్నారు.. ఆదివారం ఖమ్మం జిల్లా లోని సంస్థ జాతీయ కార్యాలయంలో భారత్, పాకిస్తాన్ యుద్ధ భీకర పోరులో అమరులైన వారికి అశ్రు నివాళులు అర్పిస్తున్నామని ఆయన అన్నారు. దేశ రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన ఎస్ ఐ. ఇంతియాజ్, గిరిజన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పట్ల తమ కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటిస్తుందన్నారు. పాక్ బలగాలు జరిపిన నిర్వీర్యమైన కాల్పుల్లో జమ్మూ కాశ్మీర్‌లో భారత జవాన్‌గా సేవలందిస్తున్న ఎస్ ఐ. ఇంతియాజ్ , మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోయిన విషయం ప్రతి భారతీయుడి హృదయాన్ని తాకిందన్నారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేయడం యావత్ భారత సమాజం గర్వకారణంగా భావిస్తుందని ఆయన మీడియాకు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ నజీరుద్దీన్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక 59వ డివిజన్ అధ్యక్షులు ఎస్ కే. జలీల్, గౌస్, హుస్సేన్, సోను తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ దేవతల పండుగలు ప్రజలను ఐక్యత,దైవచింతన వైపు మళ్లిస్తాయి

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం దోడగుంట పల్లి గ్రామంలో కురవ ఆవుల వారి కులదైవం బీరప్ప పండుగ ఘనంగా జరిగింది.ఇట్టి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీమంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో పండుగలు సోదరభావంతో నిర్వహించుకోవడం ద్వారా ప్రజలలో భక్తిప్రభత్తులు, ఐకమత్యం పెంచుతాయని అని అన్నారు.ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదక్షిణలు చేసి భక్తిప్రపత్తులతో బీరప్ప స్వామికి సమర్పించారు.మాజీ మంత్రి సింగ్ రెడ్డి నిరంజన్ రెడ్డి ని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కురవ సంఘం అధ్యక్షుడు బీరప్ప,ప్రధాన కార్యదర్శి రమేష్,ఉపాధ్యక్షులు ఆంజనేయులు,కృష్ణయ్య మరియు నాయకులు నందిమల్ల అశోక్, కొన్నూరు శ్రీనివాస్ రెడ్డి,జానకి రాములు,చిట్యాల రాము, చిన్నా రెడ్డి, కొమ్ము చెన్నయ్య,పానుగంటిసురేష్,ఆటోమల్లయ్య,వెంకటేశ్వర్ రెడ్డి,కామవరం ఆశయ్య,కండక్టర్ శ్రీశైలం,పి సురేష్, పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పరమాత్ముడే పాద సేవ చేసుకునే గొప్పతనం అమ్మది

- తల్లిదండ్రులను గౌరవిద్దాం,అమ్మను కాపాడుకుందాం
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



సాక్షాత్తు పరమాత్ముడే పాద సేవ చేసుకునే గొప్పతనం అమ్మదని అలాంటి అమ్మను గౌరవించుకుని పూజించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.తన ప్రాణం పణంగా పెట్టి మనకు ప్రాణం పోసి ప్రయోజకులను చేసిన అమ్మలను అనాధలుగా వదిలేయరాదని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి వారి ఆఖరి రోజుల్లో అండగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఉరుకుల పరుగుల జీవితంలో కన్న తల్లిదండ్రులను కనుక్కున్న బిడ్డలను నిర్లక్ష్యం చేయరాదన్నారు.పిల్లలకు చిన్ననాటి నుంచి తల్లిదండ్రుల పట్ల భక్తి శ్రద్ధలతో,వినయ విధేయతలతో ఉండేలా చూడాలన్నారు.



# ఘనంగా ఆర్జేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మంనగరంలోనిఆర్జేసిడిగ్రీకళాశాల 2000_2003 బిఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు పలుకరించుకుంటూ సందడి చేశారు. ఆటపాట లతో ఉత్సాహం గా గడిపారు. ఒక్కసారి గా చిన్న పిల్లలు గా మారి పోయి డ్యాన్స్ లతో హుషారు గా గడిపారు.ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరు కాగా విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొంటూ ఉల్లాసం గా గడిపారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.భవిష్యత్ లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.తమ కళాశాల నుండి.ఇప్పటి వరకు 25 వేల మంది విద్యార్థులుబయటకు వెళ్ళి వివిధ రకాల ఉద్యోగాలలో స్థిర పడటం అభినందనీయం అన్నారు. తమ విద్యార్థులు సేవా రంగంలో ఎల్ల వేళలా ముందుంటారని తెలిపారు. ఆర్జేసి కళాశాల అంటే క్రమ శిక్షణ కు మారుపేరని తెలిపారు. దీనిని భవిష్యత్ లోనూ చెప్పు కొనేలా విద్యార్థులు మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ శ్రీనివాస రెడ్డి, బోటనీ లక్ష్మణ్ రావు,ఆర్జేసి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. లింగయ్య, పూర్వ విద్యార్థులు రామారావు, నాగమణి, చైతన్య, సుప్రియ, వెంకటేశ్వర్లు,సాగర్ తదితరులు పాల్గొన్నారు...

# పార్టీ కార్యకర్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం దోడగుంట పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కొమ్ము చెన్నయ్యకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం దొడగుంటపల్లి గ్రామంలో గ్రామ దేవత బీరప్ప పండుగ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కొమ్ము చెన్నయ్య ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించడం జరిగింది. అలాగే పార్టీలో చురుగ్గా పాల్గొని ప్రజలకు అందుబాటులో ఉంటూ... ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ.. పార్టీలో క్రియశీలకంగా ఉండాలని చెన్నయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కామేపల్లి శివారు పెద్ద లక్ష్య తండా వాస్తవ్యులు జరపల బద్రు పద్మ ల కుమార్తె పావని. పండితాపురం గ్రామానికి చెందిన అరవ గోవిందు నాగమణిల పుత్రిక భవ్య శ్రీ. పండితాపురం గ్రామానికి చెందిన చల్లా వీరన్న కుమార్తె నవ్య. ఖమ్మం పట్టణ వాస్తవ్యులు కోడి లింగయ్య సుభద్ర ల కుమారుడు సందీప్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జగ్గారం గ్రామస్థులు భారీ ఉప్పలయ్య ఉమాల కుమార్తె అనూష ల వివాహ కార్యక్రమాల్లో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని అక్షింతలు వేసి, సాంప్రదాయాలు కనుగుణంగా పెద్దల ఎదుట ఒక్కరైన మీరు అన్యోన్య దాంపత్యంతో పది కాలాలపాటు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అజ్మీర రాందాస్. సుమన్. బొమ్మగాని పిచ్చయ్య. పల్లె ఉపేందర్ రావ్. చింతల వెంకటేశ్వర్లు. అరవ లాల్ కృష్ణ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నదే నా ఆకాంక్ష

- దేవుణ్ణి కూడా అదే కోరుకున్నా...!
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- శంకరగిరి తండాలో శిఖర, ధ్వజ ప్రతిష్టా మహోత్సవానికి హాజరు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నదే తన ఆకాంక్ష అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం శంకరగిరి తండాలో జరిగిన శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, శిఖర, ధ్వజ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రజలందరూ ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని, వివిధ రంగాల్లో ఉన్న వారందరినీ ఉన్నత శిఖరాలకు చేర్చాలని దేవుణ్ణి కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం మంగాపురం తండా తదితర ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.



# బోర్ వేసే ముందు తప్పనిసరిగా అనుమతి తీసుకోండి

- ఉప్పల్ ఎమ్మార్వో హెచ్చరిక

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ మండల పరిధిలో బోర్ వేయాలనుకునే వారు ముందుగా ఎమ్మార్వో కార్యాలయం నుండి అనుమతి తీసుకోవాల్సిందేనని తహశీల్దార్ టి. వాణి రెడ్డి హెచ్చరించారు. అనుమతి లేకుండా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.
ప్రభుత్వం వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో, అక్రమ బోర్ల తవ్వకాలను నిరోధించేందుకు అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆదివారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ భగయత్ ప్రాంతంలో అనుమతి లేకుండా తవ్విన బోర్లను అధికారులు సీజ్ చేశారు. ఎమ్మార్వో వాణి రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సామ్సన్ పాల్, జూనియర్ అసిస్టెంట్ వెంకన్న బోర్లపై చర్యలు తీసుకున్నారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అనుమతి లేకుండా బోర్ వేసే వారు కఠిన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణ నుంచి రక్షించడంలో తహశీల్దార్ కార్యాలయం కీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు.
తహశీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో అనుమతి లేని బోర్లు బయటపడిన వెంటనే చర్యలు తీసుకొని భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు. ఈ విధానంతో ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న తహశీల్దార్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకే కాకుండా భవిష్యత్తు తరాల కోసం నీటి వనరుల పరిరక్షణకు ఈ చర్యలు మేలు చేస్తాయని వారు అభిప్రాయపడ్డారు.



# వెస్ట్ బీమ్ రెడ్డి నగర్‌లో 'సిరి స్వగృహ ఫుడ్ అండ్ జనరల్ స్టోర్' ప్రారంభం

**మేడిపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

వెస్ట్ బీమ్ రెడ్డి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిరి స్వగృహ ఫుడ్ అండ్ జనరల్ స్టోర్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి హాజరై, షాప్ యజమాని శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా పలువురు కాలనీ ప్రముఖులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో పన్నాల బుచ్చి రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ రవి ప్రసాద్, సెక్రటరీ నిరంజన్ రెడ్డి, లక్ష్మయ్య గౌడ్, శివశంకర్, రమేష్ బాబు, ఉపేందర్, వీరస్వామి, రఘురాం, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు. మహిళా ప్రతినిధులుగా లత, హేమలత, మౌలిక పాల్గొన్నారు.
నూతనంగా ప్రారంభమైన స్టోర్‌కు స్థానికులు మంచి ఆదరణ చూపుతూ, వ్యాపార అభివృద్ధి కోసం శుభాకాంక్షలు తెలిపారు.



# చల్లా నరేందర్ రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొంగులేటి, ఎంపీ ఆర్ఆర్ఆర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగర కాంగ్రెస్ నాయకులు చల్లా రామకృష్ణ రెడ్డి సోదరుడు చల్లా నరేందర్ రెడ్డి ముస్తఫా నగర్ లో అత్యాధునిక హంగులతో నూతనంగా గృహాన్ని నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చల్లా నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపి పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. అనంతరం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.





# స్పోర్ట్స్ హబ్ ను సందర్శించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

- క్రీడాకారులకు ఏర్పాట్లు బాగున్నాయని నిర్వాహకులు బోడేపూడి రాజాకు అభినందన

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో నూతనంగా ప్రారంభమైన స్పోర్ట్స్ హబ్ ను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం రాత్రి సందర్శించారు. నిర్వాహకులు బోడేపూడి రాజా స్వాగతం పలికి.. స్పోర్ట్స్ హబ్ ప్రత్యేకతలు వివరించారు. ఎంపీ స్వయంగా.. ఆ ప్రాంగణమంతా కలియతిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారుల కోసం.. ఓపెన్ స్విమ్మింగ్ పూల్, అధునాతన సౌకర్యాలతో జిమ్, ఇతర క్రీడా ఏర్పాట్లు చేయడం ఎంతో బాగుందని.. నిర్వాహకులు బోడేపూడి రాజాను అభినందించారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్పోర్ట్స్ హబ్ ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు వేల్పుల సోమనర్సయ్య పెద్ద కుమారుడు మదార్‌రాజేశ్వరి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వచనాలు అందించారు.
వివాహ జీవితంలో వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపిపి నల్ల నాగిరెడ్డి, జిల్లామండల నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.
వివాహ వేడుకకు స్థానికంగా పెద్ద సంఖ్యలో బంధువులు, శ్రేయోభిలాషులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.

# టెన్త్,ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

**జనగామ,తెలంగాణ ముచ్చట్లు:**

దేవరుప్పుల మండలం, సీతారాంపురం గ్రామంలో హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ అంబటి యాకన్న ఆధ్వర్యంలో పగిడిపల్లి సతీష్ సభాధ్యక్షతన గ్రామంలోని గౌడ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు హాజరయ్యారు.ఈ మధ్య పదవ తరగతి,ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.హైదరాబాదులోని చైతన్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి విద్యార్థులకు కెరియర్పై అవగాహన కల్పించారు.స్టూడెంట్స్ కు ఉన్న అనుమానాలు,అపోహలను నివృత్తి చేశారు.ఏ కోర్సు చేస్తే ఏ విధంగా ఫ్యూచర్లో ముందుకెళ్లొచ్చు? భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి వివరాలను వారికి అందించారు.టాపర్స్ కు ప్రోత్సాహకాలు అందించారు.ఇంటర్,10వ తరగతిలో మొదటి ర్యాంకు,సెకండ్ ర్యాంకులు సాధించిన ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. వారి తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా సత్కరించారు.విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించిన ప్రొఫెసర్ రాజేందర్ రెడ్డినీ,ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమానీని సత్కరించారు.ఆపరేషన్ సింధూర కార్యక్రమంలో వీరమరణం పొందిన మన భారత జవాన్లకు ఒక నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్ చే సీతారాంపురం అనాథ వృద్ధ శరణాలయంలో అన్నదానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హనుమాన్నీ, ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి సతీష్, కోశాధికారి ఆవుల రాజు, సంయుక్త కార్యదర్శులు బస్వా నాగరాజు, దొడ్డి రమేష్, పుప్పాల సోమేశ్వర్, బాషిపాక సుధాకర్, ట్రస్టు సభ్యులు అనంతుల శివ కుమార్, పెండెం ఉపేందర్, బస్వ మల్లేశం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# అందరివాడు డా.బిర్.అంబేద్కర్

◆ అంబెద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు ఎం:

భారత రత్నా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక వర్గానికి చెందిన వాడు కాదని అంబేద్కర్ అందరి వాడని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారత దేశం నేటికి



ఐక్యంగా ఉంది అంటే, భిన్నత్వంలో ఏకత్వం కొనసాగుతుంది అంటే దానికి కారణం అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమేనని వివరించారు. దేశంలోని అన్ని మతాలకు, కులాలకు, వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించారాని తెలిపారు. సమాజంలో అంటరాని తనాన్ని, కులవివక్షకు గురవుతున్న వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించిన మహనీయులు అంబేద్కర్ ని కొనియాడారు. ఆ రిజర్వేషన్ల ద్వారానే విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయాలలో ఎదగగలుగుతున్నామని తెలిపారు. సమ సమాజ స్థాపనకు కృషి చేసిన అంబేద్కర్ గారు పీడీత వర్గాల ఆరాధ్య దైవమని అన్నారు. కేవలం చదువుతోనే మన జీవితాలలో మార్పు వస్తుందని, ఉన్నత చదువులు చదివి పోటీ ప్రపంచంలో నిలబడే విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు.

కేశవనగర్ చిన్న గ్రామం అయినా రాజకీయంగా నాకు అండగా నిలబడుతుందని అన్నారు. 25ఏళ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కేశవనగర్ గ్రామానికి రోడ్డు వచ్చిందని, ఇల్లు వచ్చాయని అన్నారు. మళ్ళీ ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలోనే ఇల్లు వచ్చాయని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ అని ఉదరగొట్టి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఏద్దేవా చేశారు. త్వరలోనే పెద్దపెండ్యాల నుండి కేశవనగర్ బీటి రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహా కమిటీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## సౌమ్య మిశ్రాని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు :

ఎన్నో యేండ్ల నుండి చర్లపల్లి డివిజన్ సంబంధించిన కాలనీల కి చెందిన రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్, ఎంఆర్ఎర్ కాలనీ నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షకాలం నుండి నీరు బయటికి పోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జైల్ కి వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జైళ్ల డైరెక్టర్ జనరల్‌గా సౌమ్య మిశ్రా గారు అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వారం రోజుల క్రితం డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయం లో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్త గారిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలవగా వెంటనే సౌమ్య మిశ్రాకి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డప్పు గిరి బాబు,నేమూరీ మహేష్ గౌడ్,ఎంకిర్యాల నర్సింహా, ఆనంద్ రాజు గౌడ్, పర్షు రామ్ , సాయి బాబా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## ధర్మాపురంలో వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల,తెలంగాణ ముచ్చట్లు:

ధర్మాపురం గ్రామానికి చెందిన అజ్మీరా బిక్కు నాయక్ కుమారుని వివాహానికి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ, వారి వైవాహిక జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

వివాహ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్ గౌడ్, ఇతర మండల నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల సమక్షంలో ఈ వేడుక శుభంగా జరిగింది

## పేద ప్రజల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ

-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం ఎంతో చేయూత ఇస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలంలోని వెంకమ్మ గూడ గ్రామంలో చిర్ర నర్సింహులు ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధనికులతో సమానంగా పేదలకు కూడా సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందులో ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలోమండల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ సర్పంచ్ రజనిత, వీరేందర్ గౌడ్,



మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, దేపల్లె కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పసుల బుచ్చయ్య, ఎం అంజం కుమార్ గౌడ్, సాములయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే శీను,గుండాల వేణు,రాజశేఖర్, దేవేందర్, వడ్డే కృష్ణ,ఆవుల శివ తదితరులు పాల్గొన్నారు.



## ఫాతిమా మాత దేవాలయంలో ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు

ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో కార్యక్రమం

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:

మండలంలోని తాటికాయల గ్రామంలో ఉన్న ఫాతిమా మాత దేవాలయంలో ఆదివారం మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మల్కాపూర్ విచారణ గురువు రామంచ శరత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ అజిత్ కుమార్, గ్రామ మహిళలతో కలిసి మాతృదినోత్సవ ప్రత్యేక కేకును కోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ''తల్లుల ప్రేమకు భూమిపై మానవ జీవితంలో ప్రత్యామ్నాయం లేదు. వారి త్యాగాలు, శ్రద్ధ, సేవలకు గుర్తుగా ఈ రోజు ప్రతి ఒక్కరూ తల్లుల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలి'' అని అన్నారు.విశేషంగా అలంకరించిన దేవాలయంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని, కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ప్రార్థనలు, శుభాకాంక్షలు, సాంఘిక భోజనంతో కార్యక్రమం ముగిసింది.

## ఏలినాటి శని దోషంతో ఇబ్బందిపడుతున్నారా..

జ్యోతిష్య శాస్త్రంలో నవ గ్రహాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నవ గ్రహాల్లో శనీశ్వరుడుకి ప్రత్యేక స్థానం ఉంది. ఎవరి జాతకంలోనైనా మందగమనుడు బలహీనంగా ఉంటే వారి జీవితంలో అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా ఏలి నాటి శని, శని దోషంతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే శని అనుగ్రహం కోసం కొన్ని ప్రత్యేక నివారణ చర్యలు సహాయపడతాయి. వారి జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. హిందూ మతంలో జీవితంలోని అన్ని సంఘటనలు మన జాతకంలో ఉన్న గ్రహాల స్థానం ఆధారంగా జరుగుతాయి. జాతకంలో గ్రహాల స్థానాలు మారడం వల్ల జీవితంపై సానుకూల, ప్రతికూల ప్రభావాలు రెండూ ఉంటాయి. హిందూ మత గ్రంథాల ప్రకారం శనీశ్వరుడిని న్యాయ దేవుడిగా భావిస్తారు. శనీశ్వరుడు మనుషులకు కర్మలను బట్టి ఫలితాలను ఇస్తాడు. అయితే జన్మ కుండలిలోని శని దోషం ఉంటే ముఖ్యమైన పనిలో అడ్డంకులు సృష్టిస్తుంటే.. చేపట్టిన పనులకు తగిన ఫలితం పొందకపోతే జీవితంలో ఏలి నాటి శని లేదా శని ధైయ్యం తో ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ సమయంలో ప్రజలు మంచి పనులు చేయకుండా, సరైన మార్గంలో రాకుండా నిరోధించడానికి శనీశ్వరుడు వారి జీవితాల్లో అనేక అడ్డంకులను సృష్టిస్తాడు. హిందూ మత విశ్వాసాల



ప్రకారం శనీశ్వరుడిని పూజించడం వల్ల మీ జీవితంలోని అన్ని సమస్యలు తొలగిపోతాయి. దీనితో పాటు జీవితంలో సానుకూల శక్తిని సృష్టిస్తుంది. పనిలో పురోగతి సాధించడానికి సహాయపడుతుంది. ఎవరి జాతకంలో శనీశ్వరుడిని ఏలి నాటి దశ జరుగుతున్నా.. శని స్థానం కారణంగా బాధపడుతున్నా.. ఖచ్చితంగా కొన్ని ప్రత్యేక నివారణలను ప్రయత్నించండి. ఈ చర్యలన్నీ తీసుకోవడం వల్ల మీ జీవితంలోని అన్ని సమస్యలను అధిగమించడానికి, మీ జీవితంలో పురోగతి సాధించడానికి కూడా మీకు సహాయపడుతుంది. ఆ ఆలయంపై పాక్ సైన్యం బాంబుల వర్షం.. అయినా పేలని బాంబులు ఎక్కడంటే శనివారం రోజు రాత్రి చంద్రుని ముందు ఆవాల నూనె దీపం వెలిగించి.. అందులో నల్ల నువ్వులు, నల్ల మినపప్పు వేయండి.''ఓం శం శనిశ్చరాయ నమః'' అనే శని మంత్రాన్ని తప్పకుండా జపించండి. ఖచ్చితంగా పేదలకు సేవ చేయండి, నల్ల బూట్లు, చెప్పులు, దుప్పట్లు దానం చేయండి. శనివారం నాడు నల్ల నువ్వులు, ఇనుము, మినపప్పు, నూనె దానం చేయండి.ఈ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించండిపురాణ మత గ్రంథాల ప్రకారం శనివారం శనీశ్వరుడిని పూజించడం ద్వారా జీవితంలో మంచి జరగడం ప్రారంభమవుతుంది. కొన్ని ప్రత్యేక నివారణలు ప్రభావవంతంగా పని చేస్తాయి. జీవితంలోని అన్ని సమస్యలను తగ్గడం మొదలవుతాయి. జీవితాంతం మంచి పనులు చేసే వారి పట్ల, ఎటువంటి తప్పులు చేయని వారి పట్ల శనీశ్వరుడు ఎల్లప్పుడూ అనుగ్రహంతో ఉంటాడు. శని అనుగ్రహం కోసం జీవితంలో చెడు సహవాసానికి దూరంగా ఉండాలని.. జీవితాంతం దేవుడిని ఆరాధించడం, దానధర్మాలు చేయడం కొనసాగించాలని పురాణ మత గ్రంథాలలో చెప్పబడిరది. గ్రంథాల ప్రకారం, శనీశ్వరుడి ప్రతి రూపంగా భావిస్తారు. అందుకే శనిదేవుడితో పాటు మహాదేవుడిని పూజిస్తాడు. శివుడిని నిర్మలమైన హృదయంతో పూజించడం ద్వారా జీవితంలోని అన్ని సమస్యలు తొలగిపోతాయి.

# కరాచీ హల్వా మన దేశంలో ఎలా అడుగు పెట్టిందో తెలుసా..

భారతదేశంలో స్వీట్లకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ ప్రతి సంతోషకరమైన సందర్భంలోనూ స్వీట్లు తింటారు. పాకిస్తాన్, భారతదేశం మధ్య యుద్ధం లాంటి పరిస్థితి ఉన్న ఈ సమయంలో ఒక స్వీట్ చాలా వైరల్ అవుతోంది. ఈ స్వీట్ పేరు కరాచీ హల్వా. భారతదేశంలో స్వీట్లకు ప్రత్యేక స్థానం ఉంది. రకరకాల స్వీట్స్ ఉన్నాయి. ఎటువంటి సందర్భంలోనైనా స్వీట్స్ కు ప్రత్యేక స్థానం ఉంది. కొంతమందికి ఆహారం తిన్న తర్వాత కూడా స్వీట్లు తినాలని కోరుకుంటారు. పండగలు, పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు వాటి సందర్భాల్లో ఇళ్లలో స్వీట్లు తప్పనిసరి. మన దేశంలో ప్రతి రాష్ట్రం, ప్రతి నగరం దాని సొంత ప్రత్యేకమైన స్వీట్లను కలిగి ఉంది. ఈ స్వీట్స్ భిన్నమైన రుచితో పాటు వాటి వెనుక కొన్ని ఆసక్తికరమైన కథలు కూడా ఉన్నాయి. అలాంటి ఒక తీపి వంటకం కరాచీ హల్వా. ఆ పేరు వినగానే ప్రజల మనసులో మెదిలే మొదటి ప్రశ్న ఏమిటంటే.. ఈ స్వీట్ పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి వచ్చిందా అని. అవును.. ఈ స్వీట్ పాకిస్తాన్ నుంచి భారతదేశానికి వచ్చింది. కరాచీ హల్వా చరిత్ర ఎంత ఆసక్తికరంగా ఉంటుందో.. భారతదేశంతో దాని సంబంధం కూడా అంతే ప్రత్యేకమైనది. ఈ స్వీట్ రంగు రంగులుగా జెల్లీలా ఉంటుంది. అంతేకాదు ఇది చాలా రుచికరంగా ఉంటుంది. ఈ రోజు మనం కరాచీ హల్వా అంటే ఏమిటి? దాని చరిత్ర ఏమిటి? భారతదేశంతో దీని ప్రత్యేక సంబంధం ఏమిటి అనే విషయాలను తెలుసుకుందాం. దీనితో పాటు.. ఈ కరాచీ హల్వాకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిస్తే ఎవరైనా సరే 'వావ్' అని అంటారు. కరాచీ హల్వాను మొక్కజొన్న పిండి, చక్కెర, నెయ్యి, డ్రై ఫ్రూట్స్ తో తయారు చేస్తారు. దీని ఆకృతి జెల్లీ లా ఉంటుంది. ఇది ఎరుపు, పసుపు , ఆకుపచ్చ రంగులలో తయారవుతుంది. ఈ హల్వా జీవిత కాలం సుదీర్ఘం అని చెప్పవచ్చు. ఈ స్వీట్‌ను 6 నెలల వరకు కూడా నిల్వ చేసుకోవచ్చు.

కరాచీ హల్వా పాకిస్తాన్ సంప్రదాయ తీపి పదార్థం. అయితే భారతదేశంలో కూడా దీనికి ప్రముఖ స్థానం ఉంది. కరాచీ హల్వాను భారతదేశంలో బాంబే హల్వా అని పిలుస్తారు. దీని పేరు వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. నిజానికి ఈ హల్వాను కరాచీ నగరానికి చెందిన ఆయ కా హల్వాయ్ కుటుంబం భారతదేశానికి తీసుకువచ్చింది. దీనిని నేడు చందు హల్వాయ్ కరాచీ హల్వా అని పిలుస్తారు. దేశ విభజన తర్వాత చందు హల్వాయ్ ఈ హల్వాను ముంబైలో అమ్మడం ప్రారంభించాడు. క్రమంగా ఈ స్వీట్ ముంబై ద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలకు వ్యాపించింది. నేడు స్వీట్ స్టాల్స్ లో హల్వా అమ్మకాలు సర్వ సాధారణం. పేరులో పాకిస్తాన్.. కానీ రుచిలో హిందూస్తాన్: ఈ మిఠాయికి కరాచీ పేరు పెట్టి ఉండవచ్చు, కానీ నేడు ఈ స్వీట్ భారతదేశంలోనే అధికంగా తయారు అవుతుంది. ఎక్కువ మంది దీనిని ఇష్టపడుతున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది: ఈ స్వీట్ కి మరింత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే దీనిని దాదాపు 6 నెలల పాటు నిల్వ చేసి తినవచ్చు. అందుకే ప్రయాణా సమయంలో దీన్ని తీసుకెళ్లడం చాలా సాధారణం. కార్న్‌ఫ్లోర్ మ్యాజిక్: హల్వాను సుజీ రవ్వ, శనగ పిండి లేదా గోధుమ పిండి, మైదా పిండితో తయారు చేస్తారు. అయితే ఈ కరాచీ హల్వా తయారీకి కార్న్‌ఫ్లోర్‌ను ఉపయోగిస్తారు. కరాచీ హల్వా ఆకృతి: కరాచీ హల్వా ఇతర హల్వాల కంటే చాలా భిన్నంగా ఉంటుంది. ఈ హల్వా ఆకృతి జెల్లీ లాంటిది. పారదర్శకంగా ఉంటుంది. అదే సమయంలో దీనిని చదరపు ఆకారంలో కట్ చేస్తారు.





# వేసవి నుంచి ఉపశమనం కోసం ఈ హిల్స్ స్టేషన్స్ బెస్ట్ ఎంపిక..

దక్షిణ భారతదేశంలో వేసవిలో ఉష్ణోగ్రత గణనీయంగా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో ప్రజలు సెలవు దినాలలో ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటారు. వేడి నుండి ఉపశమనం పొందడంతో పాటు మీ బడ్జెట్‌లోనే ప్రయాణించగల అనేక ప్రదేశాలు ఉన్నాయని మీకు తెలుసా. వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. దీంతో పిల్లలను విహారయాత్రకు తీసుకెళ్లడానికి ఇదే ఉత్తమ అవకాశమని తల్లిదండ్రులు భావిస్తారు. వేసవి కాలంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి హిమాచల్, కాశ్మీర్ , ఉత్తరాఖండ్ వంటి ప్రదేశాలకు వెళతారు. ఈ ప్రదేశాలు పర్వతాలతో నిండి ప్రకృతికి దగ్గరగా ఉంటాయి. దీంతో ఇక్కడ వేడి, తేమ నుండి ఉపశమనం లభిస్తుంది, కొన్ని రోజులైనా ప్రశాంతంగా గడపవచ్చని అనుకుంటారు. అయితే దక్షిణ భారతదేశం లో కూడా వేసవి నుంచి ఉపశమనం అందించే అనేక ప్రదేశాలున్నాయి.

మున్నార్: దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన హిల్ స్టేషన్. ఇది పచ్చదనంతో నిండి ఉంటుంది. అందంలో కాశ్మీర్‌ను కూడా మించిపోతుంది. ఇక్కడి తేయాకు తోటలే దీనికి నిజమైన గుర్తింపు. వేసవిలో ఇక్కడి వాతావరణం చల్లగా.. తాజాగా ఉంటుంది. మీరు వెళ్తే తేయాకు తోటలను సందర్శించడంతో పాటు, ఎరవికులం నేషనల్ పార్క్, మట్టుపెట్టి ఆనకట్ట, అట్టుకల్ జలపాతాలను కూడా అన్వేషించవచ్చు.

**ఊటీ** : ఉదకమండలం అని హిల్ స్టేషన్ల రాణి అని కూడా పిలుస్తారు. ఈ హిల్ స్టేషన్ కూడా చాలా అందంగా.. ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ వాతావరణం పచ్చదనం, ప్రశాంతతతో మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. చాలా చక్కటి కలపతో చేసిన నివాసాలు డిఫరెంట్ అనుభవాన్ని ఇస్తాయి. వేసవిలో కూడా ఇక్కడ ఉష్ణోగ్రత చల్లగా ఉంటుంది. ఇక్కడ సందర్శించాల్సిన ప్రదేశాలు బొటానికల్ గార్డెన్, సరస్సు, దొడ్డబెట్ట శిఖరం.

**కూర్గ్:** ఇక్కడి పచ్చదనం, పర్వతాలు దీనిని స్వర్గంలా అందంగా కనిపించేలా చేస్తాయి. కూర్గ్‌ను స్కాట్లాండ్ ఆఫ్ ఇండియా అని కూడా పిలుస్తారు. ఇక్కడ కాఫీ తోటలను అన్వేషించవచ్చు. జలపాతాలను కూడా ఆస్వాదించవచ్చు. వేసవిలో సందర్శించడానికి , విశ్రాంతి తీసుకోవడానికి ఇది సరైన ప్రదేశం. ఇక్కడికి వెళ్తే ఖచ్చితంగా అబ్బి జలపాతం, దుబారే ఎలిఫెంట్ క్యాంప్, రాజా సీటు సందర్శించండి.

పొన్ముడి: పొన్ముడి సౌత్‌లోని తక్కువ రద్దీ ఉండే హిల్ స్టేషన్. స్వచ్ఛమైన గాలిని , పచ్చదనాన్ని ఆస్వాదించగల ప్రదేశం. ఈ ప్రదేశం ట్రెక్కింగ్, వన్యప్రాణులు, ప్రశాంతమైన లోయలకు అనువైనది. ఇక్కడ గోల్డెన్ వ్యాలీ, మినీ జలపాతాలు చూడదగ్గవి.

**కున్నూర్**: ఇది చాలా ప్రశాంతంగా, తక్కువ రద్దీగా ఉండే హిల్ స్టేషన్. ప్రశాంతమైన క్షణాలు గడపాలనుకుంటే కున్నూర్ ఉత్తమమైనది. ఇక్కడ టీ తోటలు, లాంగ్ డ్రైవ్‌లు, సహజ సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. ఇక్కడ కేసిమ్స్ పార్క్, డాల్ఫిన్స్ నోస్, లాంబ్స్ రాక్ సందర్శించదగినవి.

# ఫ్రిజ్‌లో మాంసం పెడుతున్నారా..?

మనలో చాలా మంది తమ అవసరానికి మించి మాంసం కొనుగోలు చేసి మిగిలిన భాగాన్ని ఫ్రిజ్‌లో నిల్వ చేస్తారు. అయితే ఇది జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యానికి హానికరమైనదిగా మారవచ్చు. నిపుణుల సూచనల ప్రకారం మాంసాన్ని కరెక్ట్ వే లో నిల్వ చేయకపోవడం వల్ల బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది.. ఇది మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఈ. కొలి (జుంషష్ట్రవతీఅషష్ట్రఅ a షశీశ్రీఅ) అనే సూక్ష్మజీవి ఫ్రిజ్‌లో ఉంచిన మాంసం మీద చేరే ప్రమాదం ఉంది. ఈ బ్యాక్టీరియా మనకు కనిపించదు.. వాసనతో కూడా గుర్తించలేము. కానీ ఇది శరీరంలో ప్రవేశించడంలో విపరీతమైన ప్రమాదం కలిగించవచ్చు. ఫ్రిజ్ నుండి మాంసాన్ని బయటకు తీసుకున్నప్పుడు ఈ సూక్ష్మజీవులు మన చేతులకు అంటుకునే అవకాశం ఉంటుంది. తరువాత అవి నోరు, ముక్కు లేదా కంటి ద్వారా మన శరీరంలోకి చేరే అవకాశం ఉంది.ఈ బ్యాక్టీరియా శరీరంలో ప్రవేశించిన వెంటనే జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు మొదలవుతాయి. వాంతులు, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే అధిక వేడి, పొట్ట నొప్పి వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఈ సూక్ష్మజీవుల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది.మహిళలు ముఖ్యంగా ఈ బ్యాక్టీరియాతో అధికంగా ప్రభావితమవుతారు. ఈ బ్యాక్టీరియా యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్‌ను కలిగించే అవకాశం ఉంది. తరచుగా ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని వాడే మహిళల్లో మూత్ర సంబంధ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను పట్టించుకోకపోతే.. అది కిడ్నీకి కూడా హాని చేస్తుంది. ఈ మాంసాన్ని సరైన రీతిలో ఉడకబెట్టకపోతే ఫ్రిజ్‌లో ఉన్న బ్యాక్టీరియా నాశనం కాకుండా మిగిలిపోతుంది. అలా తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు ఏర్పడవచ్చు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్రమైన అలర్జీ, విరేచనాలు, చర్మంపై ఎరుపు గాట్లు, దురద వంటి సమస్యలు రావచ్చు. ఈ పరిస్థితిలో శరీరంలో వైకల్యాలు కూడా రావచ్చు. మాంసాన్ని కరెక్ట్ గా నిల్వ చేయాలంటే సరైన విధానాలు పాటించడం చాలా ముఖ్యం.



మాంసం పోషక విలువలు కాపాడాలంటే దాన్ని శుభ్రంగా కడగటం మొదటిది. తర్వాత గాలి చొరబడకుండా ఉండే కంటైనర్‌లో పెట్టాలి లేదా సురక్షితమైన ప్లాస్టిక్ కవర్లో వేసి మూసివేయాలి. ఇందులోని వాసన కూడా బయటకు రాకుండా చూసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉంచే ముందు మాంసాన్ని పూర్తిగా మూసివేసిన బ్యాగ్‌లో పెట్టడం మంచిది. అలాగే ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులపాటు నిల్వ చేయకూడదు. గడువు తీరే లోపే వాడటం ఉత్తమం. వండకుండా ఎక్కువసేపు ఉంచితే బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. మాంసాన్ని శుభ్రంగా నిల్వ చేస్తేనే అది ఆరోగ్యానికి హానికరం కాకుండా ఉంటుంది. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటే మాంసం పోషక విలువలను నిలుపుకుంటూ సురక్షితంగా ఉపయోగించుకోవచ్చు. ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని ఉపయోగించే ముందు.. అది పూర్తిగా ఉడికినట్లు నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం. వండిన తర్వాత కూడా కొంత సమయం పాటు వేడిగా ఉంచడం లేదా మరోసారి బాగా వేడి చేయడం అవసరం. ఇలా చేయడం వల్ల మాంసంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుంది. అంతేకాకుండా మాంసాన్ని ఫ్రిజ్‌లో ఎక్కువ కాలం నిల్వ చేయకుండా.. వీలైనంత త్వరగా వినియోగించడం ఆరోగ్యానికి మంచిది. మాంసాన్ని ఫ్రిజ్‌లో నిల్వ చేయడం వల్ల ఆరోగ్య ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉన్నప్పటికీ.. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చు. శుభ్రంగా కడగడం, సరైన కంటైనర్లలో నిల్వ చేయడం, పరిమితి గడువు లోపలే వాడటం, పూర్తిగా ఉడికించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యపరమైన సమస్యలను అధిగమించవచ్చు.



# కాలం చేసిన వారి ఫొటోలు ఇంట్లో పెడుతున్నారా..

చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం గౌరవప్రదమైన ఆచారం. అయితే, వాస్తు శాస్త్ర నియమాలను పాటించడం వల్ల ఈ ఆచారం ఇంట్లో సానుకూల శక్తిని నిలబెడుతుంది. ఫొటోలను సరైన దిశలో, తగిన సంఖ్యలో, గౌరవంగా ఉంచడం ద్వారా కుటుంబం శాంతి, శ్రేయస్సు పొందవచ్చు. ప్రతికూల శక్తిని నివారించడానికి, పడకగది, పూజా గది వంటి స్థలాల్లో ఫొటోలను ఉంచకూడదు. ఇంట్లో చనిపోయిన వారి ఫొటోలు ఉంచడం భారతీయ సంప్రదాయంలో సామాన్యమైన ఆచారం. చాలా మంది తమ వారిపై ఉన్న ప్రేమతో గుమ్మానికి ఎదురుగా కనిపించేలా ఫొటో ఫ్రేములను ఉంచుతుంటారు. ఇంకొందరు దేవుడి గదిలో పెడుతుంటారు. అయితే, ఇలా చేయడం ఎంత వరకు మంచిది? ఈ ఆచారం వెనుక ఆధ్యాత్మిక నమ్మకాలతో పాటు వాస్తు శాస్త్రం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం వల్ల పూర్వీకుల జ్ఞాపకాలు నిలిచి ఉంటాయి. కుటుంబ సభ్యులు వారి సానుకూల గుణాలను గుర్తుచేసుకుంటారు. ఈ ఆచారం పూర్వీకుల పట్ల గౌరవాన్ని చూపిస్తుంది. వాస్తు శాస్త్రం ప్రకారం, ఫొటోలను దక్షిణ గోడపై ఉత్తరం వైపు చూసేలా ఉంచడం వల్ల వారి ఆత్మకు శాంతి చేకూరుతుంది. ఇది ఇంట్లో వారసత్వ భావాన్ని కాపాడుతుంది. కుటుంబ సభ్యులకు మనసు నెమ్మదిని ఇస్తుంది. కొన్ని నమ్మకాల ప్రకారం, పూర్వీకుల ఆశీస్సులు కుటుంబానికి శ్రేయస్సును తెస్తాయి. వాస్తు శాస్త్రం ప్రకారం, చనిపోయిన వారి ఫొటోలను సరైన స్థలంలో ఉంచకపోతే ఇంట్లో శక్తి సమతుల్యత దెబ్బతినవచ్చు. పడకగది, పూజా గది, లేదా ప్రధాన గదుల్లో ఫొటోలు పెట్టడం మంచిది కాదు. ఇది కుటుంబ సభ్యుల మనసులో బాధ, భయం కలిగించవచ్చు. ఫొటోలు ఎక్కువగా ఉంచడం వల్ల ఇంట్లో ప్రతికూల శక్తి పెరిగే అవకాశం ఉందని వాస్తు నిపుణులు హెచ్చరిస్తారు. పూజా గదిలో దేవుళ్లతో పాటు ఈ ఫొటోలను ఉంచి పూజించడం కూడా సరికాదు. ఇది దేవతల ఆగ్రహానికి కారణం కావచ్చని నమ్ముతారు. చనిపోయిన వారి ఫొటోలను ఉంచేటప్పుడు వాస్తు శాస్త్రం కొన్ని నియమాలను సూచిస్తుంది. ఫొటోలను దక్షిణ గోడపై ఉత్తరం వైపు చూసేలా వేలాడదీయడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల ఆత్మకు శాంతి లభిస్తుందని నమ్మకం. ఒకటి లేదా రెండు ఫొటోలను మాత్రమే ఎంచుకుని, జాగ్రత్తగా ఉంచడం మంచిది. ఫొటోలను శుభ్రంగా ఉంచి, గౌరవంగా చూసుకోవాలి. పగిలిన ఫ్రేములు లేదా దెబ్బతిన్న ఫొటోలను వెంటనే తొలగించాలి. ఇంటి ప్రధాన గదుల్లో ఫొటోలను ఎక్కువగా ప్రదర్శించకూడదు. ఆధ్యాత్మిక దృక్కోణంలో, చనిపోయిన వారి ఫొటోలు ఇంట్లో ఉంచడం వల్ల కుటుంబం వారి ఆత్మలతో సంబంధాన్ని కొనసాగిస్తుంది. కొన్ని సంప్రదాయాల్లో, ఈ ఫొటోల వద్ద దీపం వెలిగించడం వల్ల ఆత్మకు శాంతి చేకూరుతుందని చెబుతారు. ఈ ఆచారం కుటుంబ సభ్యులకు మానసిక బలాన్ని ఇస్తుంది. అయితే, ఈ ఫొటోలను దేవుళ్లతో సమానంగా పూజించడం సరికాదని ఆధ్యాత్మిక గురువులు సూచిస్తారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# త్వరలోనే రిటైర్మెంట్?



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించేందుకు సిద్ధమయ్యాడని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందే టెస్టు క్రికెట్ నుంచి కోహ్లి తప్పుకుంటాడని, ఇప్పటికే తన నిర్ణయాన్ని బీసీసీఐకి తెలియజేసినట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి.

ఈ క్రమంలో కనీసం ఇంగ్లండ్ సిరీస్ వరకైనా కొనసాగేలా కోహ్లిని ఒప్పించేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చాలా మంది మాజీ క్రికెటర్లు కూడా కోహ్లిని తన రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచన చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ సిరీస్‌తోనే టీమిండియా 2025 27 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ప్రారంభం కానుంది. ఒకవేళ విరాట్ రిటైర్మెంట్ ప్రకటిస్తే, ఈసారి ఇంగ్లండ్‌కు వెళ్లే జట్టులో అనుభవం లేని యువ ఆటగాళ్లే ఉండే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలోనే బీసీసీఐ అతడి మనసు మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

**మనసు మార్చుకోని కోహ్లి..**

కానీ కోహ్లి మాత్రం రిటైర్మెంట్ దిశగానే అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. విరాట్ తను మొదట తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. కోహ్లి తన టెస్టు రిటైర్మెంట్ విషయంపై వారాల క్రితమే సెలెక్టర్లకు సమాచారం ఇచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో ఆడేలా అతడిని ఒప్పించడానికి బీసీసీఐ ప్రయత్నిస్తోంది. కానీ అతడి మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకునేలా కన్పించడం లేదు. వచ్చే వారం జరిగే సెలక్షన్ సమావేశంలో కోహ్లి కొనసాగుతాడా? లేదా అన్నది తేలిపోనుంది అని బీసీసీఐ వర్గాలు టైమ్స్ ఆఫ్ ఇండియాతో పేర్కొన్నాయి. కాగా రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టులకు విడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అతడి స్దానంలో భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంగ్లండ్ సిరీస్‌కు భారత జట్టును మే 23న బీసీసీఐ ప్రకటించనుంది. విరాట్ ఇప్పటివరకు 123 టెస్టుల్లో భారత్ ప్రాతినిధ్యం వహించాడు. 46.85 సగటుతో 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలు, 31 అర్ధ శతకాలు ఉన్నాయి.

# ఐపీఎల్-2025 ఫైనల్ వేదిక, తేదీ మార్పు?

ఐపీఎల్ 2025 సీజన్‌ను తిరిగి ప్రారంభించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే మే 15 లేదా 16వ తేదీన ఐపీఎల్ తిరిగి మొదలయ్యే అవకాశముంది. మంగళవారం (మే 13) నాటికి ఆటగాళ్లందరినీ జట్టుతో చేరేలా చూసుకోవాలని ఫ్రాంఛైజీలకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ఫైనల్ వేదికను మార్చాలని భారత క్రికెట్ బోర్డు యోచిస్తున్నట్లు సమాచారం. షెడ్యూల్ ప్రకారం.. మే 25న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

ఇప్పుడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి ఫైనల్ వేదికను మార్చనున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్ తేదీలో కూడా మార్పు చోటు చేసుకోనున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. మే 25 బదులుగా మే 30న తుది పోరు జరగనున్నట్లు తెలుస్తోంది.




కాగా భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తల కారణంగా ఐపీఎల్ 2025ను బీసీసీఐ వారం రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అయితే మిగిలిన మ్యాచ్‌లకు విదేశీ ఆటగాళ్ల అందుబాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. చాలా మంది ఫారన్ ప్లేయర్లు ఇప్పటికే తమ స్వదేశాలకు వెళ్లిపోయారు.

# ఆర్సీబీకి భారీ షాక్.. ఐపీఎల్ నుంచి స్టార్ ప్లేయర్ ఔట్ ?

ఐపీఎల్ 2025 పునఃప్రారంభానికి బీసీసీఐ ప్రణాళికలు మొదలు పెట్టింది. భారత్‌పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తలు కాస్త తగ్గుముఖం పట్టడంతో ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత క్రికెట్ బోర్డు సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే మే 15 లేదా మే 16న ఐపీఎల్ మ్యాచ్‌లు మళ్లీ మొదలయ్యే అవకాశముంది.

అయితే ఈ క్యాష్ రిచ్ లీగ్ పునఃప్రారంభమవుతున్న వేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ తగిలే సూచనలు కన్పిస్తున్నాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హాజిల్ వుడ్ గాయం కారణంగా ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు తెలుస్తోంది. హాజిల్ వుడ్ ప్రస్తుతం భుజం నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే మే 3న సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌కు అతడు దూరమయ్యాడు. అయితే అతడు జట్టుతో పాటు ఉండడంతో తర్వాతి మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని ఫ్యాన్స్ భావించారు. కానీ అంతలోనే బీసీసీఐ ఐపీఎల్‌ను వారం రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేసింది. దీంతో హాజిల్‌వుడ్ తన స్వదేశానికి వెళ్లిపోయాడు.

ఈ క్రమంలో అతడు తిరిగి భారత్‌కు వచ్చే సూచనలు కన్పించడం లేదు. జూన్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ ఉన్నందున ముందు జాగ్రత్తగా అతడిని తిరిగి పంపకూడదని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే జరిగితే ఆర్సీబీకి గట్టి ఎదురు దెబ్బే అనే చెప్పాలి.




ఈ ఏడాది సీజన్‌లో హాజిల్‌వుడ్ 10 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. టోర్నీ నిలిచే సమయానికి అత్యధిక వికెట్లు తీసిన మూడవ బౌలర్‌గా ఉన్నాడు. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, స్టార్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ కూడా తిరిగి వచ్చేది అనుమానమే. కాగా ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీ దుమ్ములేపుతోంది. 11 మ్యాచులలో 8 విజయాలు సాధించి.. 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది.

# ముక్కోణపు వన్డే సిరీస్ విజేతగా భారత్.. ఫైనల్లో శ్రీలంక చిత్తు

మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ విజేతగా భారత్ నిలిచింది. ఆదివారం కొలంబో వేదికగా ఆతిథ్య శ్రీలంకతో జరిగిన ఫైనల్‌లో 97 పరుగుల తేడాతో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. ఈ తుది పోరులో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 342 పరుగుల భారీ స్కోర్ సాధించింది.




భారత బ్యాటర్లలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అద్భుతమైన సెంచరీతో చెలరేగింది. మంధాన క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించింది. మొత్తంగా 101 బంతులు ఎదుర్కొని 15 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 116 పరుగులు సాధించింది. ఆమెతో పాటు హర్లీన్ డియోల్(47), రోడ్రిగ్స్(44), హర్మన్ ప్రీత్ కౌర్(41) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. లంక బౌలర్లలో మల్కీ మదార, విహంగా, కుమారి తలా వికెట్ సాధించారు.

# లండన్‌లో రామ్ చరణ్ మైనపు విగ్రహావిష్కరణ..




లండన్‌లోని ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ప్రముఖ నటుడు రామ్ చరణ్ మైనపు విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. తాజాగా లండన్‌లో గ్లోబల్ స్టార్ చరణ్ తానే స్వయంగా విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి రామ్ చరణ్‌తో పాటు భార్య ఉపాసన, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ, కుమార్తె క్లీంకార సైతం పాల్గొన్నారు. రామ్ చరణ్ సోఫాలో కూర్చున్నట్లుగా మైనపు విగ్రహాన్ని రూపొందించారు. ఈ మైనపు విగ్రహంలో ఆయనతో పాటు తన పెంపుడు కుక్క రైమ్ కూడా ఉండటం అందరినీ ఆకట్టుకుటోంది.

ఈ విధంగా పెంపుడు జంతువుతో కలిసి ఉన్న మైనపు విగ్రహం కలిగిన సెలబ్రిటీల్లో తొలి వ్యక్తి రాణి ఎలిజబెత్ 2, రెండో వ్యక్తిగా రామ్ చరణ్ కావడం గమనార్హం. ఈ వేడుకలో చరణ్ తన పెంపుడు కుక్క రైమ్‌తో కలిసి తన మైనపు విగ్రహంతో ఫొటోలు దిగారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్టార్ నటులు ప్రభాస్, అల్లు అర్జున్ తర్వాత మేడమ్ టుస్సాడ్స్‌లో మూడో టాలీవుడ్ నటుడిగా రామ్ చరణ్ విగ్రహం ఉండటం మరో విశేషం. ఇక ఈ ప్రతిమను సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత విగ్రహం అక్కడే శాశ్వతంగా ఉంటుంది.

## మాకు కామన్స్ సెన్స్ లేదా నువ్వొచ్చి చెప్పాలా..


ఇండియా పాకిస్థాన్ కాల్పులు విరమించుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ట్రంప్ ఓ ట్వీట్ కూడా చేశారు. ఒక రాత్రంతా ఇరు దేశాలతో అమెరికా మాట్లాడిందని చెప్పారు. తాను రిక్వెస్ట్ చేసిన తరవాత రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని తెలిపారు. కామన్ సెన్స్ మరియు తెలివి ఉపయోగించినందుకు రెండు దేశాలకు అభినందనలు తెలిపారు.

కాల్పుల విరమణపై దృష్టి పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ట్రంప్ ట్వీట్ పై ఆర్మీవీ సెటైరికల్ కామెంట్ చేశాడు. అంటే నువ్వు చెప్పకుంటే మాకు కామన్ సెన్స్ కానీ తెలివి కానీ లేవా? నువ్వు వచ్చి మాకు నేర్పిస్తున్నావా? అంటూ సెటైర్ వేశాడు. ప్రస్తుతం ఆర్జీవీ చేసిన ట్వీట్ వైరల్ గా మారింది. ఈ ట్వీట్ పై నెటిజన్లు తమ స్టైల్‌లో స్పందిస్తున్నారు. ఆర్జీవీ సెటైరిక్‌గా చెప్పినా ట్రంప్ మాటలు అలాగే ఉన్నాయని అంటున్నారు. మరికొందరు నెటిజన్లు ఇప్పుడు నీ ట్వీట్లు అవసరమా అంటూ మండిపడుతున్నారు.



## రుక్మిణి వసంత్ కొత్త సినిమా అప్డేట్

యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి వచ్చి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఆ తర్వాత భఘీర, రణగాల్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. అనతి కాలంలోనే క్రేజీ బ్యూటీ గా మారిన రుక్మిణి వరుస సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతుంది. ప్రస్తుతం ఈ అమ్మడు ఎన్టీఆర్-నీల్ చిత్రంతో పాటు కోలీవుడ్ స్టార్ శివకార్తికేయన్ సరసన 'మదరాసి' లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాలతో పాటు రుక్మిణి, తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి కాంబోలో రాబోతుంది. ఆరుముగ కుమార్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో యోగిబాబు,దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, బీఎస్ అవినాష్, ముత్తు కుమార్, రాజ్ కుమార్, డెనెస్ కుమార్.



# డైరెక్టర్‌కు బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన కార్తీ..

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ గత ఏడాది 'సత్యం సుందరం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయం సాధించాడు. ప్రస్తుతం కార్తీ సర్దార్2 , ఖైదీ2, వా వాతియార్ వంటి చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీ బిజీగా ఉన్నాడు. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టీవ్‌గా ఉంటున్నాడు. తాజాగా, కార్తీ 'సత్యం సుందరం' డైరెక్టర్ ప్రేమ్ కుమార్‌కు కాస్ట్‌లీ గిఫ్ట్ ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. థార్ ROxx AX5L కారును ఆయనకు అందించారు. ఇకఈ వీడియోను చూసిన నెటిజన్లు సూపర్ అని కార్తీపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా, కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రలో నటించిన 'సత్యం సుందరం' సినిమా అంతగా సక్సెస్ కాకపోయినప్పటికీ తెలుగు, తమిళ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. సూర్య నిర్మాణంలో వచ్చిన మూవీస్‌లో ఈ చిత్రం దిబెస్ట్‌గా నిలుస్తుంది. అయినప్పటికీ డైరెక్టర్‌కు గిఫ్ట్ ఇవ్వడంతో నెటిజన్లు కార్తీని మెచ్చుకుంటున్నారు.



ఇక ఈ విషయాన్ని తెలుపుతూ డైరెక్టర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. ''మహీంద్రా థార్ ఎన్నాళ్ల నుంచో కలలు కంటున్నా. ఆచరణాత్మక కారణాల వల్ల నేను 5 డోర్ల వెర్షన్ కోసం వేచి చూశాను. నాకు ప్రత్యేకంగా తెలుపు రంగులో థార్ రాక్స్ AX 5L 4x4 వేరియంట్ కావాలని ఉండేది. దాని లాంచ్ తర్వాత, నేను దానిని కోనాలని అనుకున్నా. రాజా సర్ సహాయం కోరాను. దానిని త్వరగా పొందడం సాధ్యమేనా అని చూడటానికి. ఓపిక నశించిపోయింది. ఇదంతా రాజా సార్‌కి చెప్తే సైలెంట్‌గా ఉండిపోయారు. కానీ నిన్న సూర్య అన్న నుంచి కారు ఫొటో మెసేజ్ వచ్చింది. నేను ఫస్ట్ షాకయ్యాను. వెంటనే రాజా సర్‌కి ఫోన్ చేసి నా దగ్గర ఇప్పుడు డబ్బులు లేవని చెబితే. ఆయన నవ్వి, ప్రేమ్ ఇది నీకు సూర్ సర్ ఇస్తున్న గిఫ్ట్ అని అన్నారు. దీంతో నాకు మాట రాలేదు. సూర్య సర్ ఇంటికి వెళ్లి కార్తీ అన్న చేతుల మీదుగా కారు అందుకున్నాను.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in